బస్టాండ్‌లో వసతులు కరువు

- శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు
- తాగునీరు లేక ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో శిథిలావస్థకు చేరిన మూత్రశాలలు



ఇబ్రహీంపట్నం బస్టాండ్

ఇబ్రహీంపట్నం: 37 ఏళ్ల క్రితం ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్టాండ్‌ను ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా తయారైంది. వసతులు కరువై ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. 1988లో అప్పటి ప్రభుత్వం రూ. 8లక్షలతో బస్టాండ్‌ను నిర్మించి అదే సంవత్సరంలో డిసెంబర్ 4న ప్రారంభించారు. ఏడాదిపాటు వాడుకలోకి ఆర్టీసీ అధికారులు తీసుకున్నా.. తర్వాత బస్టాండ్ లోకి బస్సులు రాకపోవడంతో నిరుపయోగంగా ఉండి మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు బస్టాండ్‌ను వాడుకలోకి తీసుకురావాలని విన్నవించినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోలేదు. బస్టాండ్‌లోని ఫ్లోరింగ్ రాళ్లను కూడా గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. ఆరేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం గ్రామ పంచాయతీ నిధులు రూ.3లక్షలతో అప్పటి సర్పంచ్ బస్టాండ్‌లో ఫ్లోరింగ్ చేయించి రంగులు వేయించి, సుందరంగా తీర్చిదిద్ది అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేతుల మీదుగా బస్టాండ్‌ను పునఃప్రారంభించారు. అప్పటి నుంచి బస్టాండ్‌లోకి నిత్యం బస్సులు వస్తు వెళ్తున్నాయి కానీ బస్టాండ్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మహిళలకు మూత్రశాలలు, తాగునీటి వసతి కూడా కరువైంది. వేసవిలో బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభించినా.. ఆర్టీసీ అధికారులు పెట్టిన రంజన్ల లో నీళ్లు పోసేవారు లేక అవి నిరుపయోగంగా ఉన్నాయి. మండల కేంద్రం నుంచి చుట్టు గ్రామాలకు వెళ్లేందుకు బస్సుల సంఖ్యను పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్, నిర్మల్‌కు బస్సులు నడిపించాలని మండలవాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరుగుదొడ్లను మరమ్మతు చేయించి, నీటి వసతిని కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్‌లో వసతులు కల్పించాలి



బస్టాండ్‌లో కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు వాడుకలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. తాగునీటి వసతి లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

– కొడిమ్యాల దీపక్‌రాజ్, ఇబ్రహీంపట్నం

అదనపు బస్సులు నడిపించాలి



మండలంలోని కోజన్‌కొత్తూర్, ఎర్దండికి, గుమ్మిర్యాల దొంచదకు ప్రతిరోజు 2 బస్సులు నడిచేవి. ఇప్పుడు ఒకొక్క బస్సు నడపడంతో ప్రయాణికులు ఇ బ్బందులు పడుతున్నారు. కోజ న్‌కొత్తూర్ ఎర్దండికి ప్రతి సోమవారం, బుధవారం, శుక్రవారం గోదావరి మొక్కులు తీర్చుకునేందుకు అనేక మంది భక్తులు వెళ్తారు. ప్రయాణికులకు సరి పడా బస్సులు నడిపించాలి.

– తిమ్మణి అరుణ్, ఇబ్రహీంపట్నం

సమయం పడుతుంది

బస్టాండ్‌లో వసతులు కల్పించడానికి సమయం పడుతుంది. ముఖ్యంగా మరుగుదొడ్లను మెయింటనెన్స్ చేయడానికి ఒక మనిషి కావాలి. కాబట్టి కొంత సమయం తీసుకున్న తర్వాత వసతులు కల్పిస్తాం. శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లను మరమ్మతులు చేయిస్తాం.

– దేవరాజ్, మెట్‌పల్లి డిపో మేనేజర్

‘రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాం’



ధాన్యం కొనుగోళ్లు పరిశీలిస్తున్న కృష్ణారావు

కోరుట్లరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైస్ మిల్లర్ల దోపిడీని పూర్తిగా అరికట్టామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని యూసుఫ్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ తప్పా తాలు లేకుండా దాన్యాన్ని శుద్ధి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ చింతకుంట సాయిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేశ్ గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు లింబాద్రి, సొసైటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో నిర్వాహకులు ఖచ్చితత్వం పాటించాలని, కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, నాయకులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, అంతడుపుల నర్సయ్య, మిట్టపెల్లి జీవన్‌రెడ్డి, పూండ్ర లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ధర్మపురిలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ధర్మపురి: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురిలో అనేకం సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేసారు. పట్టణంలోని కర్నె అక్కపెల్లి కల్యాణ మండపంలో శుక్రవారం మాట్లాడారు. గోదావరి తలాపున ఉన్నప్పటికీ పట్టణ ప్రజలకు శాశ్వత మంచినీటి సరఫరా కరువైందని, వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.15 కోట్లు టీయూఎఫ్ఐడీసీ మంజూరు కాగా, ఇప్పటికీ పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. మాతాశిశు ప్రభుత్వ ఆస్పత్రిని ఇంతవరకు ప్రారంభించలేదని, ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసీయూ గదిని ఇంతవరకు ప్రారంభించలేదని అదే విధంగా టెంపుల్ సిటీ కింద కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రసాద్‌స్కీంను తీసుకవచ్చి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గాజు భాస్కర్, బెజ్జారపు లవన్‌కుమార్, రవికుమార్, సూరత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యం పెంచడానికే శిక్షణ శిబిరాలు

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల నైపుణ్యతలను పెంపొందించడానికి వేసవి శిక్షణ శిబిరాలు తోడ్పడుతాయని ఎంఈవో బండారి మధు అన్నారు. మండలంలోని గోధూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ శిబిరంలో వేదగణితం, స్పోకెన్ ఇంగ్లీష్, యోగా స్పోర్ట్స్, బేసిక్ మాథ్యమెటిక్స్ నేర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమ ప్రభాకర్, నాయకులు కోటగిరి వెంకటస్వామి, జాజాల జగన్‌రావు, బండిరాజేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని బాలబాలికలు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి(ఎంఈవో) దామోదర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్సీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 14 ఏళ్ల లోపు పిల్లలకు మల్లాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో ఉదయం 7గంటల నుంచి 10 వరకు కరాటే, యోగాలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దేశానికి సేవ చేయడం అదృష్టం



సైనికుడికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రాయికల్: 17 ఏళ్ల పాటు దేశానికి సేవ చేయడం పూర్వ జన్మ సుకృతమని సైనికుడు నూకల మల్లయ్య అన్నారు. శుక్రవారం ఇండియన్ ఆర్మీలో సేవలందించి పదవీ విరమణ పొంది స్వగ్రామానికి రావడంతో గ్రామస్తులు, యువజన సంఘ సభ్యులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూకల మల్లయ్య మాట్లాడుతూ తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, దేశానికి ఎప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. నేటి యువత దేశానికి సేవ చేయడం కోసం ముందుకు వచ్చి ఆర్మీలో చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు జక్కుల చంద్రశేఖర్, అన్నవేని వేణు, మహేశ్వర్‌రావు, తుమ్మనపల్లి విజయ్, దేవేందర్‌రెడ్డి, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థానాలకు వెళ్లాలి



విద్యార్థినులను అభినందిస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల: విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పదో తరగతిలో విజయకేతనం ఎగురవేశారని, ముమ్ముందు మరింత ఉన్నత స్థానాలకు వెళ్లాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. జాగృతి పాఠశాల విద్యార్థులు వర్ష 558, సహస్రని 556 సాధించగా, వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజిరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రభుత్వ విప్ అభినందన

ధర్మపురి: ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అభినందించారు. పట్టణంలోని ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. 600 మార్కులకు 578 మార్కులు సాధించి మండల్ టాపర్‌గా నిలిచిన జోనాథన్ జోసెఫ్‌తో పాటు 540కి పైగా వచ్చిన విద్యార్థులను విప్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఎస్ దినేష్, తోట శంకర్, శ్రీనివాస్ తదితరులున్నారు.


కేజీబీవీ విద్యార్థినికి..

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 10 తరగతి పరీక్ష ఫలితాల్లో 542 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచిన జె. అక్షర, ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరంలో జి. మహర్ష 971 మార్కులు సాధించి టాపర్‌గా నిలువడంతో శుక్రవారం వారిని జగిత్యాల డీఈవో కార్యాలయంలో కేజీబీవీ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ శిరీషా, డీఈవో రాము ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు సన్మానం

రాయికల్: మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన బొడ్డుపల్లి రక్షిత పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్‌గా నిలువగా శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటి రమణి, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ర్యాలీ



కోరుట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కోరుట్ల: వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కోరుట్ల పట్టణంలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్లకార్డులు, నల్ల జెండాలతో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ చట్టాన్ని సవరించారని మండిపడ్డారు. పాత వక్ఫ్ చట్టాన్నే కొనసాగించాలన్నారు.అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో ముస్లిం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం



ఉత్సమూర్తులను కల్యాణానికి తీసుకువస్తున్న భక్తులు

సారంగాపూర్: మండల కేంద్రంలోని శ్రీ రామాలయం అనుబంధ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర, పద్మావతి, అలివేలు మంగా దేవీ ఉత్సవమూర్తులకులో మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి, పచ్చని పందిరిలో స్వామివారి కల్యాణంను ఆలయ అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు తరలివచ్చారు.

ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్‌లో..



వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లో శుక్రవారం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దేవేందర్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాములోరి బ్రహ్మోత్సవాలు



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కథలాపూర్: మండలంలోని దూలూర్‌లో శ్రీరాములోరి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. స్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నియోజకవర్గ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ– ఆండాలు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

బుగ్గారం: మండలంలోని గోపులాపూర్‌లోని అన్నంనేని శ్రీవేణి క్రికెట్ గ్రౌండులో ఎమ్మెల్యే క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రికెట్ జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు బల్మూరి రామారావు, వేముల సుభాష్, మండల క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

సారంగాపూర్: మండల తహసీల్దార్‌గా వహీదుద్దీన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వహీదుద్దీన్‌ను సారంగాపూర్ తహసీల్దార్‌గా బదిలీ చేయగా, సారంగాపూర్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తున్న జమీర్‌ను జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ వహీదుద్దీన్‌ను డెప్యూటి తహసీల్దార్ రాజశేఖర్, ఆర్ఐ వెంకటేశ్, సిబ్బంది సన్మానించారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

కోరుట్ల: పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని పద్మశాలీ నాయకులు అన్నారు. పట్టణ పద్మశాలీ కులోన్నతి సంఘం, యువత ఆధ్వర్యంలో ఇటీవల ఉన్నత పదవులు చేపట్టిన పద్మశాలీ కులస్తులను స్థానిక పద్మశాలీ భవన్‌లో శుక్రవారం సన్మానించారు. లయన్స్ క్లబ్ రెండో డిస్టిక్ గవర్నర్ గుంటుక చంద్ర ప్రకాష్, లయన్స్ క్లబ్ మైక్రో కేబినెట్ మెంబర్ ఆడెపు మధు, కోరుట్ల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కస్తూరి రమేష్, కోశాదికారి చింతకింది ప్రేమ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గోనె రాజేశ్ ఖన్నా, కెమెరా క్లబ్ అధ్యక్షుడు తడుక సత్యనారాయణ, వేంకటేశ్వర ఆలయ కమిటీ ధర్మకర్త కటుకం దివాకర్ లను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, జిల్లా ధనుంజయ, గడ్డం మదు, ముల్క ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌పై సీఐకి ఫిర్యాదు

మెట్‌పల్లి: ఫిర్యాదులో తేదీని తప్పుగా నమోదు చేసిన మహిళా కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని ఏనుగు లక్ష్మి అనే మహిళ శుక్రవారం సీఐ అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం..మల్లాపూర్‌కు చెందిన లక్ష్మిపై అదే గ్రామానికి చెందిన గడ్డం అలియాస్ తిప్పిరెడ్డి అంజిరెడ్డి అనే వ్యక్తి జనవరి 21న దాడి చేశాడు. దీనిపై ఫిర్యాదు చేయడానికి 23న లక్ష్మి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ మౌనిక పిటిషన్ రాయగా, కేసు నమోదైంది. అయితే పిటిషన్‌లో 21-01-25 బదులు 21-12-24 అని రాసింది. అప్పటి నుంచి కేసు విషయంలో ఎలాంటి పురోగతి లేదని, కానిస్టేబుల్ కేసును నీరుగార్చడానికి తేదీని తప్పుగా నమోదు చేసిందని సీఐని కలిసి వివరించింది. ఆమెపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరింది.

గుండెపోటుతో మున్సిపల్ కార్మికుడు మృతి

ధర్మపురి: ధర్మపురికి చెందిన పులి భూమరాజు (42) అనే మున్సిపల్ కార్మికుడు గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మున్సిపల్ కార్యాలయంలో గత కొన్నేళ్లుగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన భూమరాజు చాతిలో నొప్పి అంటూ కుప్పకూలి మృతి చెందాడు. మృతుడు భూమరాజుకు గత 10 నెలల నుంచి జీతాలు రావడం లేదని, దీంతో కుటుంబ పోషణ భారమై మనస్తాపంతో గుండెపోటుతో మృతి చెందాడని సీఐటీయూ జిల్లా కన్వీనర్ ముడుగం రాజలింగు, బీజేపీ నాయకులు ఆరోపించారు. మృతుడికుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసిన వెంటనే శుక్రవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతాకుమారి దహన సంస్కారాల కోసం రూ.10 వేల ఆర్థిక సాయం అందించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మున్సిపల్ కార్యాలయం తరుపున మరో 10 వేల ఆర్థిక సాయం అందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్యాల: మండలంలోని ముత్యంపేట ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నామని విద్యుత్ ఏఈ దయానంద్ తెలిపారు.వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

నిరుపేద యాదవులకు అండగా ఉంటాం

ధర్మపురి : తల్లిదండ్రులను కోల్పోయిన అనాథపిల్లలకు, నిరుపేద యాదవ కుటుంబాలకు యాదవ సంఘం అండగా ఉంటుందని యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ అన్నారు. ధర్మపురి మండలంలోని నక్కలపేట గ్రామానికి చెందిన పుట్ట నర్సయ్య–జమున దంపతులకు అఖిల (21), రాజేశ్ (16), శరత్ (14) ముగ్గుర పిల్లలు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం. అనారోగ్య సమస్యలతో తల్లిదండ్రులు మృతి చెందగా ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. పిల్లల దీన స్థితిపై తెలుసుకున్న యాదవ సంఘం నాయకులు, జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్, యాదవులు తలా కొంత జమ చేసి మొత్తం రూ.87,132 శుక్రవారం నక్కల పేటలో వారికి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చండీహోమం ప్రారంభం

రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో నవ చండీ హోమం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పారాయణం, దీక్ష స్వీకరణ, యాగశాల ప్రవేశం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రమేశ్ శర్మ, ఘనపాటి, చిరంజీవి, పాఠశాల కరస్పాండెంట్ బాలె జయశ్రీ శేఖర్, ప్రిన్సిపాల్ నిఖిల్‌తో పాటు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్రికల్చర్ కాలేజీని తరలిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న మాడవేణి సునీల్

జగిత్యాలటౌన్: రాజకీయ లబ్ధి కోసం అగ్రికల్చర్ కాలేజీని తరలిస్తే ఊరుకునేది లేదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్ హెచ్చరించారు. ఏబీవీపీ నగరశాఖ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ధర్మపురి నియోజకవర్గానికి కేటాయించిన అగ్రికల్చర్ కాలేజీని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం మానకొండూరు నియోజకవర్గానికి తరలించాలనే ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీ తరలింపునకు వ్యతిరేకంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు. ధర్మపురి పరిధిలోని స్తంభంపల్లిలో కాలేజీకి 75 ఎకరాల భూమి కేటాయించారని, వెంటనే కాలేజీ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జోనల్ ఇన్‌చార్జి విష్ణు, సాయికిరణ్, సర్వేస్, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించండి



గొర్రెపల్లిలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

మల్లాపూర్: ఎస్సెస్సీ పూర్తయిన విద్యార్థులను మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేర్పించాలని ఆ కళాశాల అధ్యాపకులు రాజేశం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గొర్రెపల్లిలో శుక్రవారం వారు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత బస్‌పాస్, స్కాలర్‌షిప్‌లతో పాటు విశాలమైన తరగతిగదులు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో ప్రభుత్వ కళాశాలలో బోధన తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జగిత్యాల తహసీల్దార్ రాంమోహన్ అన్నారు. శుక్రవారం అర్బన్ మండలం ధరూర్ లో కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలన్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే నమోదు చేయాలన్నారు.కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్: జనగణనతో పాటు, కులగణనకు కేంద్రం, ప్రధాని నరేంద్ర మోదీ ఆర్డినెన్స్ జారీ చేసినందుకు శుక్రవారం రాయికల్‌లో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మహిళ మోర్చ జిల్లా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మీ, సింగిల్ విండో చైర్మన్ ముత్యంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లిలో..

పెగడపల్లి: జనాభా లెక్కలతో పాటు కులగణన జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని మండల బీజేపీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ గణన తప్పుల తడకగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పల్లె మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు గంగుల కొమురెల్లి, నాయకులు బాబు, సాయికృష్ణ, జనార్దన్, అంజి, గట్టయ్య, కుమార్, హరీశ్, సాగర్, సునీల్ పాల్గొన్నారు.